క్లుప్తంగా

బీసీ వసతి గృహంలో దరఖాస్తులు

అశ్వాపురం: మండల కేంద్రంలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో చేరేందుకు ఈ విద్యా సంవత్సరానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వసతి గృహం వార్డెన్ నరసింహారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వసతి గృహంలో ఉంటూ స్థానిక పాఠశాలలో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుకోవచ్చన్నారు. వసతి గృహంలో ప్రవేశం కొరకు పాస్ పోర్ట్ సైజు ఫొటోలు నాలుగు, కుల, ఆదాయ ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డు జిరాక్స్‌లు జత చేయాలన్నారు. వసతి గృహంలో ప్రభుత్వం నుంచి అన్ని సదుపాయాలు కల్పిస్తామని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పాలు, పండ్లు పంపిణీ



వృద్ధులకు పాలు, బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేస్తున్న రంజిత్ కుటుంబ సభ్యులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం కూనవరం రోడ్డులోని సరోజిని వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఆదివారం పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. పట్టణంలోని చేతన మీసేవ నిర్వాహకులు భూక్యా రంజిత్ నాయక్ కుమారుడు 'జెస్సి' జన్మదిన వేడుకలు సరోజినీ ఆశ్రమంలో కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో క్లాసిక్ షరీఫ్, మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ నాయక్, మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కొప్పుల మురళి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు ధరావత్ భాస్కర్, శ్రీరామ్ రెడ్డి, అభిరామ్ రెడ్డి, చేతన భూక్యా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటికి వినతి



మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

ములకలపల్లి: రాజీవ్ ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రెవెన్యూ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం మంత్రి పొంగులేటిని కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు చిరుమప్ప మట్లాడారు. గత పదిహేడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న క్యాడర్ మార్పు, ఉద్యోగ భద్రత, సీనియారిటి ప్రకారం ప్రమోషన్లు, ఖాళీ పోస్టుల భర్తీ తదితర అంశాలపై న్యాయం చేయాలని విన్నవించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంపత్, రాము, కృష్ణ, శ్రీకాంత్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో బడిబాట

దుమ్ముగూడెం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బడిబాటలో భాగంగా నర్సాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ పరిధిలోని రామకృష్ణాపురం, సింగారం, బండారుగూడెం, తూరుబాక గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. బడిబాటలో భాగంగా ప్రతి ఇంటికీ తిరిగి కరపత్రాలను అందించారు. మౌఖికంగా మైకుల ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలను ప్రకటించారు. అడ్మిషన్ ఫారాలను వారి ఇంటి వద్దనే అందరి సమక్షంలో నింపించి, తల్లిదండ్రులతోనూ పిల్లలతోనూ సంతకాలు చేయించి సమోదు కార్యక్రమాన్ని వినూత్నంగా నిర్వహించారు. కార్యక్రమంలో బెక్కంటి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు కృష్ణ, నాగేశ్వరరావు, పన్నాలాల్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

16 ఇఫ్టూ ఏరియా మహాసభ

మణుగూరురూరల్: ఈ నెల 16న జరిగే ఇఫ్టూ మణుగూరు ఏరియా మహాసభను విజయవంతం చేయాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు ఆర్.మధుసూధన్‌రెడ్డి కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఇఫ్టూ కార్యాలయంలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, హక్కులు, చట్టాల పరిరక్షణ కోసం కార్మిక వర్గం పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ మేరకు బలమైన కార్మిక ఉద్యమాల నిర్మాణం కోసం జరుగుతున్న ఇఫ్టూ ఏరియా మహాసభను కార్మికవర్గం అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఇఫ్టూ నాయకులు బి.మల్సూర్, జిల్లా అశోక్, ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ అధ్యక్ష,కార్యదర్శులు వి జానయ్య, పి.సంజీవరెడ్డి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు, బ్రాంచ్ కార్యదర్శి పి.లక్ష్మీ నారాయణ, నాయకులు పాల్గొన్నారు.

ఏజెన్సీని వెంటాడుతున్న జ్వరాలు

- రెండు నెలల్లో నలుగురు మృతి
- కాళ్లు, ఒళ్లునొప్పులతో బాధితులు ఎందరో..
- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న హెల్త్ సబ్‌సెంటర్లు



చర్ల సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న బాధితులు

చర్లరూరల్: చర్ల ఏజెన్సీ మండలాన్ని జ్వరాలు వెంటాడుతున్నాయి. లోపం ఎక్కడ జరిగినప్పటికీ గడిచిన సుమారు రెండు నెలల కాలంలో నలుగురు యువకులు జ్వరాలతో మృతి చెందారు. ఈ ఏడాది వేసవి కాలంలో చర్ల మండలంలోని కొత్తపల్లి, కలివేరు, రాళ్లగూడెం, గుంపెనగూడెం, లక్ష్మీకాలనీ, చర్ల పట్టణంలోని అనేక ప్రాంతాల్లోని ప్రజలు వైరల్, డెంగీ జ్వరాలతో అనేక బాధలు పడ్డారు. కొందరికి జ్వరాలు తగ్గినప్పటికీ ఒళ్ళు, కీళ్ళ నొప్పులతో చాలా రోజులు బాధపడిన సంఘటనలు అనేకం. కొద్ది రోజులు తగ్గినట్లే తగ్గిన జ్వరాలు మళ్లీ విజృంభించాయి. ఈ నేపథ్యంలో మండలంలోని రాళ్ళగూడెం గ్రామంలో ఓ యువకుడు జ్వరంతో బాధపడుతూ మృతి చెందగా.. లక్ష్మీకాలనీలో ఒకే కుటుంబానికి చెందిన 20 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న అన్నదమ్ములు జ్వరాలతో బాధపడుతూ ఐదురోజుల వ్యవధిలోనే మృతి చెందారు. దీంతో ఆ కుటుంబానికి తీరని లోటును మిగిల్చింది. ఇద్దరు అన్నదమ్ముల మృతితో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కదిలింది. చర్ల వైద్యశాఖ అధికారులను అప్రమత్తం చేసి వైద్య శిబిరాలను నిర్వహించాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా.. వారం రోజుల క్రింద మండలంలోని చినమిడిసిలేరు గ్రామంలో డెంగీ జ్వరంతో మరో 25 యువకుడు మృతి చెందాడు.

అసంతృప్తిగా హెల్త్ సబ్ సెంటర్ల పనితీరు..

చర్ల మండలంలోని కొయ్యూరు, సత్యనారాయణపురం సీహెచ్‌సీల పరిధిలో 12 హెల్త్ సబ్ సెంటర్లు ఉన్నాయి. సబ్ సెంటర్లలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది పని చేస్తున్నారా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆయా సబ్ సెంటర్లలో పనిచేసే వైద్య సిబ్బంది ఆయా గ్రామాల్లో ఎవరెవరు అనారోగ్యంతో బాధపడుతున్నారో వారిని గుర్తించి వైద్యశాలకు పంపిచాల్సిన బాధ్యత ఉంటుంది. అలాగే ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స తీసుకుంటూ.. పూర్తిగా రోగం తగ్గేంత వరకు వారిని చికిత్స తీసుకోవాలని చెప్పాల్సిన బాధ్యత వారిదే. కానీ సబ్ సెంటర్లలో పనిచేస్తున్న వారు ఎంతమంది రోగులను ఫాలోఅప్ చేస్తున్నారో వారికే తెలవాలి.

టీంలను సిద్ధం చేస్తున్నాం..



ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్య సేవలను మరింత మెరుగు పరుస్తున్నాం. ప్రతీ గ్రామంలో రాపిడ్ రెస్పాన్స్ టీంలను రెడీ చేస్తున్నాం. జ్వరాల విషయంలో శానిటేషన్ అనేది చాలా ముఖ్యం. అందుకని పంచాయితీ సెక్రటరీ, అంగన్‌వాడీ, ఆశాలు మొత్తం టీంగా వెళ్లి ప్రతీ మంగళవారం, వైద్య సిబ్బంది ప్రతీ శుక్రవారం చెక్ చేస్తారు. హెల్త్ సబ్ సెంటర్లలో పనిచేసే సిబ్బంది గ్రామాల్లో జ్వర బాధితులను ఫాలోఅప్ చేయాల్సి ఉంటుంది.

– జేవీఎల్ శిరీష, డీఎంఅండ్‌హెచ్‌ఓ

మొరం.. మాయం

- యథేచ్ఛగా గ్రావెల్ తోలకాలు
- ట్రాక్టర్లలో డంపింగ్, లారీల్లో తరలింపు



మూకమామిడి ప్రాజెక్ట్ శివారులో గ్రావెల్ తవ్విన దృశ్యం

ములకలపల్లి: మూకమామిడి ప్రాజెక్ట్ శివారులోని మొరం (గ్రావెల్)పై అక్రమార్కుల కన్నుపడింది. ట్రాక్టర్ల ద్వారా తరలించి బీటి రోడ్డు సమీపానికి తీసుకువచ్చి డంప్ చేస్తున్నారు. రాత్రి వేళ గుట్టుచప్పుడు కాకుండా లారీల్లో బయటికి తరలిస్తున్నారు.

సరికొత్త మార్గంలో..

అక్రమార్కులు గ్రావెల్ మాఫియాకు సరికొత్త మర్గాన్ని ఎంచుకున్నారు. సాధారణంగా ఇసుక అక్రమార్కులు వాగుల నుంచి ఇసుకను బయటికి తరలించి, నిల్వ చేస్తారు. తరువాత లారీల్లో దానిని బయటకు తరలిస్తున్నారు. ఇదే విధానాన్ని గ్రావెల్ తరలింపులోనూ వాడుతున్నారు. ప్రాజెక్ట్ శివారులో జేసీబీతో క్వారీలోని గ్రావెల్ తోడి, ట్రాక్టర్ల ద్వారా లారీలు లోడింగ్‌కు అనువుగా ఉన్న ప్రాంతానికి తరలిస్తున్నారు. క్వారీ నుంచి సుమారు కిలోమీటరు దూరం వరకూ వచ్చి, మూకమామిడి క్రాస్‌రోడ్ సమీపంలోని సంద్రకుంట మూలమలుపు వద్ద బీటీ రోడ్డుకు అత్యంత సమీపంలోని గ్రావెల్ కుప్పలు నిల్వ చేస్తున్నారు. అదునుచూసి యథేచ్ఛగా టిప్పర్ లారీల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి అక్రమ తరలింపుకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు ముక్త కంఠంతో కోరుతున్నారు. ఈ విషయమై ములకలపల్లి రేంజ్ ఆఫీసర్ రవికిరణ్‌ను వివరణ కోరగా.. క్షేత్రస్థాయిలో పరిశీలించి, చర్యలు చేపడతామని తెలిపారు.

పునర్వసు కల్యాణం

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో పునర్వసు నక్షత్ర సందర్భంగా ఆదివారం మాస కల్యాణం నిర్వహించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఉత్సవ విగ్రహాలను మండపంలోకి తీసుకుని వచ్చారు. కల్యాణోత్సవంలో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, యాత్రా ధారణ, యజ్ఞోపవీత ధారణ, స్వామి వారి అమ్మవారి ప్రవర్లు, మధుపర్కాలు,మహా సంకల్పం మంగళాష్టకాలు, జిలకర బెల్లం మాంగల్య పూజ మాంగల్య ధారణ మంగళ హారతి, మంత్రపుష్పం చేపట్టి కల్యాణతంతు నిర్వహించారు. ఆలయ ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్, ఆలయ ముఖ్య అర్చకులు శేషం కిరణ్ కుమార్ ఆచార్యులు, పాడిచేటి సీతారామానుచార్యులు, ఆలయ సిబ్బంది శివ, రాము పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: పినపాక నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులు వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. ఆదివారం ప్రజాభవన్‌లో ఐటీడీఏ, ఇరిగేషన్, ఆర్ అండ్‌బీ, మున్సిపల్, మున్సిపల్ హెల్త్ డిపార్ట్‌మెంట్ విభాగం, పంచాయతీరాజ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాధాన్యత క్రమంలో ప్రజలనుంచి వచ్చిన వినతుల మేరకు ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన పనులతో పాటు విభాగాల్లో ప్రస్తుతం జరుగుతున్న పనుల పురోగతిని అడిగి తెలుసుకుని నివేదికలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు. మండలాల్లోని ప్రధాన రోడ్లకు చేపట్టాల్సిన మరమ్మతులు, గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించాల్సిన రోడ్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు..

దుమ్ముగూడెం: దుమ్ముగూడెంలో ముత్యాలమ్మ వారిని ఆదివారం పినపాక శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లు దంపతులు దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యే దంపతులకు ఆలయ అర్చకులు, సిబ్బంది సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వీరమాచినేని సునీల్ నాయకులు కెల్లా శేఖర్, గద్దం బాలాజీ, లంకా ప్రసాద్ ఉన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

చర్లరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందించే పాఠ్యపుస్తకాలు వచ్చాయి. మండలంలోని 84 పాఠశాలలో చదివే తెలుగు, ఇంగ్లిష్ మీడియం విద్యార్థులకు మొత్తం పాఠ్యపుస్తకాలతో పాటు 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు నోటు పుస్తకాలు కూడా వచ్చాయని ఎంఈఓ ఝుంకీలాల్ తెలిపారు. ఎంఈఓ ఆదేశాల మేరకు ఆయా పాఠశాలలకు పుస్తకాలను పంపిణీని ఆదివారం ప్రారంభించారు.

ఆర్థిక సాయం

కరకగూడెం: మండల కేంద్రానికి చెందిన ఆటో యూనియన్ మండల అధ్యక్షుడు బాదే సాగర్ తండ్రి చిట్టిబాబు ఇటీవల అనారోగ్య కారణాలతో మృతిచెందగా ఆదివారం మండల ఆటో యూనియన్ నాయకులు దశ దిశ కర్మల నిమ్మితం బాధిత కుటుంబానికి వారి ఇంటి వద్ద రూ.10 వేలు, 25 కేజీల బియ్యం, నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ సెక్రెటరీ ఎలగొండ శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ రావుల వేణు యూనియన్ నాయకులు బెజవాడ రాములు, గాడిపెల్లి సమ్మయ్య, కాంపాటి చిట్టిబాబు, కొలగాని రవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు అనుమతులివ్వండి

గుండాల: ముత్తాపురం నుంచి పెద్దతోగు వరకు రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు ఇవ్వాలని ధర్మ సమాజ్ పార్టీ నాయకులు, సామాజిక విశ్లేషకులు సామ్రాట్ సంజీవన్ అన్నారు. పెద్దతోగు గ్రామానికి నిధులు మంజూరు అయినప్పటికీ ఫారెస్టు అధికారులు అనుమతులు ఇచ్చేందుకు ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, నిత్యాసర సరుకులకు వచ్చిపోయే ఆ గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనులకు అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పెయింటర్స్ యూనియన్ అధ్యక్షుడిగా వందనం

చంద్రుగొండ: పెయింటర్స్ యూనియన్ మండల అధ్యక్షుడిగా రసవత్తరపు వందనాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చంద్రుగొండలో ఆదివారం బిల్డింగ్ పెయింటింగ్ వర్కర్లు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో అధ్యక్షుడిగా వందనంతోపాటు ఉపాధ్యక్షుడిగా మాగంటి శ్రవణ్, కార్యదర్శిగా శిరికొండ వీరభద్రంలను ఎన్నుకున్నారు.

మోదీ ప్రమాణ స్వీకారానికి హాజరు

అశ్వాపురం: భారత ప్రధానిగా నరేంద్రమోదీ ఆదివారం ఢిల్లీలో ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు, మహబూబాబాద్ పార్లమెంట్ కన్వీనర్, ఐకార్ మెంబర్ ముస్కు శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ.నడ్డా ప్రత్యేక ఆహ్వానం మేరకు ముస్కు శ్రీనివాసరెడ్డి మోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు.

'ఆటా' సభల్లో మనోళ్లు

అశ్వాపురం: ఈ నెల 7,8,9 తేదీల్లో అమెరికాలోని అట్లాంట మహానగరంలో వైభవంగా జరిగిన అమెరికా తెలుగు సంఘం(ఆటా) 18వ మహాసభల్లో అశ్వాపురం మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐలు కందిమళ్ల సత్యనారాయణరెడ్డి, జాలె సుధాకర్‌రెడ్డి, తిప్పిరెడ్డి విజయ్ భాస్కర్‌రెడ్డితో పాటు పలువురు ఎన్‌ఆర్‌ఐలు పాల్గొన్నారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

చర్ల: మండలంలో ఆదివారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలను నిర్వహించారు. మండల కేంద్రమైన చర్లలో ఆదివారం జరిగే వారపు సంతకు సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా, బీజాపూర్, దంతెవాడ జిల్లాల్లోని అటవీ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ఆదివాసీలు తరలివస్తుండగా వారి మాటున మావోయిస్టులు, మిలీసియా సభ్యులు, కొరియర్లు, సానుభూతిపరులు రావచ్చునన్న అనుమానంతో పోలీసులు తనిఖీలను నిర్వహించారు. చర్లకు వచ్చే ప్రధాన రహదారులైన లెనిన్ కాలనీ, తాలిపేరు ప్రాజెక్టు, కలివేరుక్రాస్‌రోడ్, దానవాయిపేట రోడ్‌లలో మోహరించిన సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పార్టీ, సివిల్ పోలీసులు వచ్చిపోయే ఆదివాసీలను ఆపి నిశితంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అనుమానితులుగా భావిస్తూ పలువురు ఆదివాసీలను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించి నిర్ధారించుకున్న తరువాత వారిని విడిచిపెట్టారు. సీఐ రాజువర్మ నేతృత్వంలో ఎస్సైలు టీవీఆర్ సూరి, నర్సిరెడ్డి తనిఖీలను నిర్వహించారు.

కూలీలకు రూ.600 చెల్లించాలి



మాట్లాడుతున్న రేపాకుల శ్రీనివాస్

ములకలపల్లి: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు కొలతలతో సంబంధం లేకుండా రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని తెలంగాణా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదరిశ రేపాకుల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘ జిల్లా అధ్యక్షుడు మచ్చా వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆదివారం ములకలపల్లిలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా రోజూవారీ వేతనం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అవకతవకలపై విచారణ జరిపించాలని, పోడు భూములకు బోర్లు, వ్యవసాయ కనెక్షన్లు, మోటారు సౌకర్యం కల్పించాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షులు అన్నవరపు కనకయ్య, బి.చిరంజీవి, బత్తుల వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శులు నిమ్మల వెంకన్న, ముదిగొండ రాంబాబు, మర్మం చంద్రయ్య, జిల్లా కమిటీ సభ్యుడు రావూజా, వేణు, అబేదా, చంటి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

మణుగూరురూరల్: పట్టణంలోని మణుగూరు జెడ్పీ కోఎడ్యుకేషన్ ఉన్నత పాఠశాల 2011–12 విద్యాసంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం అయ్యారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఆనాటి జ్ఞాపకాలను, మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. భవిష్యత్తులో ఎవరికైనా ఎలాంటి కష్టం వచ్చినా ఐక్యంగా పరిష్కరించుకుందామని నిర్ణయం తీసుకున్నారు. అనంతరం ఆడుతూ పాడుతూ సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్, పటేల్, చారి, నాగభూషణం, రాంరెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడికి మాతృవియోగం



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ యూత్ వింగ్ నాయకుడు లంక శివ మాతృమూర్తి రమాదేవి అనారోగ్యంతో బాధపడుతూ.. ఆదివారం మృతి చెందారు. మృత దేహాన్ని వివిధ పార్టీలకు చెందిన నాయకులు సందర్శించి నివాళులు అర్పించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బాధిత కుటుంబాన్ని స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పరామర్శించి ధైర్యం చెప్పారు. సంతాపం తెలిపిన వారిలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు అన్నే సత్యనారాయణ మూర్తి, కనితి రాముడు, ఎంపీపీ రేసు లక్ష్మి, నాయకులు దామెర్ల శ్రీనివాసరావు, మోతుకురి శ్రీకాంత్, జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, మండల అధ్యక్షుడు లంక అబ్బులు, కెల్లా శేఖర్, శ్రీధర్, కాంగ్రెస్ యువజన నాయకులు తెల్లం హరికృష్ణ, తోట రమేష్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే జారే పర్యటన

అశ్వారావుపేటరూరల్: మండలంలోని బచ్చువారిగూడెం, ఊట్లపల్లి గ్రామాల్లో ఆదివారం అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పర్యటించారు. ముందుగా ఊట్లపల్లి గ్రామంలో జరిగిన ఓణీల వేడుకకు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. అనంతరం మండలంలో బచ్చువారిగూడెంలో ఇటీవలె అనారోగ్యంతో మృతి చెందిన రామినేని నాగేంద్రరావు కుటుంబాన్ని పరామర్శించి, మృతుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జూపల్లి ప్రమోద్, ఆకుల శ్రీను, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలకు ఉద్యమిద్దాం

గుండాల: రాష్ట్రంలో, దేశంలో నిరుద్యోగ యువత రోజురోజుకు పెరిగిపోతోందని, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం యువత ఉద్యమించాలని పీవైఎల్ ఇల్లందు డివిజన్ కార్యదర్శి సనప కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం పీవైఎల్ గుండాల మండల నూతన కమిటీ ఎన్నుకున్నారు.మండల అధ్యక్షుడిగా పూనె శ్రావన్, కార్యదర్శిగా పూనెం మంగయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కుమార్ కాంగ్రెస్, ఎన్డీయే ప్రభుత్వాలు యువత పట్ల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తే సహించేది లేదని అన్నారు. పీవైఎల్ రాష్ట్ర రాజకీయ శిక్షణా తరగతులు ఈనెల జూలై రెండో వారంలో మధిరలో జరుగుతాయని, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కల్తి సుదర్శన్, కుంజా నరేష్, మోహన్, సురేష్, కృష్ణ, ధర్మరాజు, ప్రభాకర్ పాల్గొన్నారు.

వైద్యశిబిరం విజయవంతం



వ్యాధి బాధితులకు మందులు అందజేస్తున్న డాక్టర్ పవన్‌రెడ్డి

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో భద్రాచలానికి చెందిన సూర్య హాస్పటల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఉచిత వైద్య శిబిరాన్ని జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, ఎంపీపీ రేసు లక్ష్మీలు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. సూర్య హాస్పటల్ డాక్టర్లు పవన్‌రెడ్డి, డాక్టర్ గీత పావనిలు 215 మంది రోగులను పరిశీలించి వారికి ఉచితంగా మందులు అందజేశారు.

డాక్టర్లు పవన్ రెడ్డి, గీతపావనిలు మాట్లాడుతూ.. భవిష్యత్‌లో భద్రాచలం నియోజకవర్గం వ్యాప్తంగా మరెన్నో ఉచిత క్యాంపులు ఏర్పాటు చేస్తామని, ప్రజలకు నాణ్యమైన వైద్యం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం సంఘ సేవకులు ఆధ్యాత్మికవేత్త లయన్ గాదె మాధవరెడ్డి, హాస్పటల్స్ ఇన్‌చార్జ్ రాజు, వెంకట్, శివ, పిలక వెంకట రమణ రెడ్డి, అన్నెం సత్యనారాయణ మూర్తి, లంకా శ్రీనివాసరావు, కనుబుద్ది దేవా, కణితి రాముడు, తెల్లం హరీ, మోతుక్కూరు శ్రీకాంత్, దామెర్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబురాలు



మణుగూరురూరల్: విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

అశ్వారావుపేటరూరల్: దేశ ప్రధానిగా మోదీ మూడో సారి ప్రమాణ స్వీకారం చేయడంతో ఆదివారం రాత్రి అశ్వారావుపేటలో బీజేపీ ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్లో పార్టీ మండల అధ్యక్షుడు బండారు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో టపాసులు కాల్చి, స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గుండాల: నిరంతరం దేశ ప్రజల కోసం పనిచేస్తూ, ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేది మోదీ ప్రభుత్వమేనని బీజేపీ మండల అధ్యక్షులు సోలం సతీష్ అన్నారు. దేశంలో మూడో సారి బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన సంధర్బంగా ఆదివారం మండల కేంద్రంలో టపాసులు కాల్చి, సంబంరాలు జరిపారు. రానున్న రోజుల్లో ఇంకా అనేక సంక్షేమ పథకాలకు శ్రీకారం చుడతారని అన్నారు. బీజేపీ గెలుపుపై హర్షం వ్యక్తం చేస్తూ కేట్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఇర్ప ప్రకాష్, హరి, రాధాక్రిష్ణ, అశోక్, రవీందర్, టీడీపీ నాయకులు తోలెం సాంబయ్య, ఇల్లందుల అప్పారావు, నర్సింహులు, కనకయ్య, యాకయ్య, గడ్డం సాయి, రాంబాబు, ప్రవీణ్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: భారతదేశ ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా బీజేపీ, జనసేన, టీడీపీల ఆధ్వర్యంలో ఆదివారం విజయోత్సవ ర్యాలీ, సంబురాలు నిర్వహించారు. పట్టణంలోని సురక్షా బస్టాండ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ పూలమార్కెట్ సెంటర్, సినిమాహాల్ సెంటర్ మీదుగా అంబేడ్కర్ సెంటర్ వరకు చేరుకుంది. ర్యాలీలో బాణాసంచా కాలుస్తూ.. డీజే సౌండ్స్‌తో సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేశంలో మోడీ ప్రభుత్వం తిరుగులేనిశక్తిగా ఎదిగిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జంపన సీతారామరాజు, లింగంపల్లి రమేష్, బిక్షపతి, సరస్వతి, బ్రహ్మతేజ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.